


రేపటి నుంచి యోగా బ్యాచ్ ప్రారంభం

కడప అర్బన్ : పటేల్ రోడ్డులో ఉన్న మిత్ర యోగా సెంటర్‌లో 30 రోజుల పాటు నిర్వహించే యోగా శిక్షణ కొత్త బ్యాచ్‌ను జూన్ 1 నుంచి ప్రారంభిస్తున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ కల్పన, డాక్టర్ రంగనాథరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణలో రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి, అధిక బిపి, డయాబెటిస్, ఒబేసిటీ వంటి దీర్ఘకాలిక సమస్యల నివారణకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకోవడానికి అవసరమైన యోగాసనాలు, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు, షట్ క్రియలు, ధ్యానం వంటి యోగా ప్రక్రియలను శాస్త్రీయంగా సాధన చేయిస్తామని పేర్కొన్నారు. శిక్షణ ఉదయం 5.45 గంటల నుంచి 7.00 గంటల వరకు మొదటి బ్యాచ్, ఉదయం 8.30 గంటల నుంచి 10 గంటల వరకు మహిళలకు రెండో బ్యాచ్, సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 గంటల వరకు. మూడవ బ్యాచ్ ఉంటుందని తెలిపారు. వివరాలకు 9848861206, 7013238986లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

కొండలు, గుట్టలకు పట్టాలు

- పదేళ్లయినా సాగు చేయని వైనం
- కేవలం పంట రుణాలు, రైతు భరోసా కోసమే వినియోగం
- ఉదాసీనత ప్రదర్శిస్తున్న రెవెన్యూ శాఖ

ప్రజాశక్తి - సింహాద్రిపురం



మండలంలో పదేళ్ల నుంచి రెవెన్యూ అధికారులు పలుమార్లు అసైన్‌మెంట్ కమిటీ ద్వారా డికెటి పట్టాలను పంపిణీ చేశారు. వాటిలో చాలావరకు కొండలు, గుట్టలకు సంబంధించిన సర్వే నంబర్లు వేసి రెవెన్యూ అధికారులు పట్టాలు ఇచ్చినట్లు సమాచారం. మండలంలోని రావుల కులను, బలపనూరు, అంకాలమ్మ గూడూరు తదితర గ్రామాలలో కమిటీ ద్వారా పట్టాలు పంపిణీ చేశారు. ఇందులో స్థానికంగా లేని వారికి పట్టాలు ఇవ్వడం పట్ల అప్పట్లో ఆయా గ్రామాల రైతులు వ్యతిరేకించారు. రావులకొలను గ్రామంలోని సర్వే నెంబరు 716 బి 566/ 11లో ఓ మహిళతో పాటు మరికొంతమంది స్థానికంగా వారికి పట్టాలిచ్చారు. ఇందులో గురజాల, సింహాద్రిపురం తదితర గ్రామాల వారికి పట్టాలిచ్చారు. ఇలా మండల వ్యాప్తంగా దాదాపు 80 నుంచి100 పట్టాలు పంపిణీ చేసినట్లు సమాచారం. పట్టాల పంపిణీ చేసి దాదాపు పదేళ్లయినా నేటికీ సాగుకు నోచుకోలేదు. అప్పట్లో పట్టాల పంపిణీ చేసే సమయానికి ఆ సర్వే నెంబరులో స్థానికంగా ఉన్న రైతులు సాగులో ఉండడంతో పంపిణీ అనంతరం చాలామంది లబ్ధిదారులు ఏమాత్రం పట్టించుకోలేదు .ఇటీవల కాలంలో భూముల ధరలకు రెక్కలు రావడంతో అక్కడికి పట్టాదారులు వెళ్లగా స్థానికంగా ఉన్న రైతులు ఆ భూమి అనుభవంలో ఉన్న వారు ఉన్నారు.

కేవలం పంట రుణాలు, రైతు భరోసా కోసమే వినియోగం..

ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో సాగులో ఉన్న రైతులకు పట్టాలు ఇవ్వాలని రెవెన్యూ శాఖకు ఆదేశించినా క్షేత్రస్థాయిలోని కొంతమంది సిబ్బంది చేతివటం ప్రదర్శిస్తూ సాగు దారులకు కాకుండా ఇతరులకు పట్టాలు ఇచ్చారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అసైన్‌మెంట్ కమిటీ ద్వారా పంపిణీ చేసిన పట్టాలలో స్థానికంగా ఉన్నవారు మాత్రమే అరకొరగా సాగు చేసుకుంటున్నారు తప్ప స్థానికేతరులకు ఇచ్చిన పట్టాలలో చాలామంది సాగుకు నోచుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పట్టాలతో కేవలం బ్యాంకులలో పంట రుణాలు పొందడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న రైతు భరోసా సొమ్మును తమ ఖాతాలో పడేలా చూస్తూ ప్రభుత్వాన్ని దగా చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. కొంతమంది డికెటి పట్టాదారులు ఏమాత్రం పంట సాగు చేయనప్పటికీ సాగు చేసినట్లు రికార్డులలో నమోదు చేయించి పరిహారం సైతం పొందుతున్నట్లు తెలుస్తుంది. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట సాగు చేయని వారిని గుర్తించి వారి పట్టాలను రద్దు చేయాలని రైతులు కోరుతున్నారు.

స్థానికేతరులకు ఇస్తే ఒప్పుకోం



మా గ్రామంలోని బంజరు భూమిలో ఇతర గ్రామాలకు చెందిన రైతులకు ఇస్తే ఒప్పుకోం. ఇప్పటికే దీని పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. గతంలో ఇచ్చిన పట్టాలు సైతం రద్దు చేయాలి. మండలంలో కొన్ని గ్రామాలలోని చెరువులో మట్టిని పొలాలకు తరలి స్తుంటే, ఆ మట్టిని కేవలం మా గ్రామ రైతులు మాత్రమే వినియోగించుకోవాలంటూ ఆయా గ్రామాల రైతులు అడ్డుకుంటున్నారు. అలాంటిది మా గ్రామంలో బంజర భూముని ఇతరులకు ఇస్తే మేము ఎట్లా ఒప్పుకుంటాం.

- రాయుడు, రైతు, రావులకులను

సాగు చేసే రైతులకు మాత్రమే పట్టాలు ఇవ్వాలి



ప్రభుత్వం నిబంధనల ప్రకారం భూమి సాగు చేసే రైతులకే పటా ్టలు ఇవ్వాలి. అలా కాకుండా అనహర్హులకు పట్టాలి ఇవ్వడం సరికాదు. సాగు దారులకు కాకుండా ఇత రులకు పట్టాలు ఇవ్వడం పట్ల నిజమైన పంట సాగు చేసే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కావున ప్రభుత్వం స్పం దించి సాగు చేయకుండా ఉన్న పట్టాలను గుర్తించి వెంటనే రద్దు చేయాలి. రద్దు చేయని పక్షంలో జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో సాగు రైతులతో కలిసి ప్రత్యేక కార్యా చరణతో ఉద్యమిస్తాం.

-దస్తగిరిరెడ్డి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి, కడప.

విద్యా హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో ప్రయివేటు, కార్పొరేటు విద్యా సంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీలకు పాల్పడుతున్నాయని, ముందస్తు అడ్మిషన్ల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యా హక్కు చట్టాన్ని లెక్కచేయకుండా నడుస్తున్నాయని, అయిన విద్యా శాఖ అధికారులు నిద్ర మత్తులో ఉన్నారని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు గండి సునీల్ కుమార్, వీరణాలశివకుమార్ తెలిపారు. గురువారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రయివేట్, కార్పొరేటు విద్యా సంస్థలు యథేచ్ఛగా ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. విద్యా హక్కు చట్టానికి భిన్నంగా వేల రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను నిలువుదోపిడీకి పాల్పడుతున్నారని తెలిపారు. విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నారని చెప్పారు. బహిరంగంగా ప్రయివేట్, కార్పొరేటు విద్యా సంస్థలు విచ్చలవిడితనానికి పాల్పడుతున్న విద్యా శాఖా అధికారులు మొద్దు నిద్రలో వున్నారనన్నారు. కడపలోని దుర్గమ్మ గుడి పక్కన ఉన్న నారాయణ కార్పొరేటు స్కూల్‌కు గుర్తింపు లేకున్నా అడ్మిషన్లకు పాల్పడుతున్నారంటే విద్యా శాఖా వారికి ఎంత అనుకూలమో అర్థం అవుతుందని వాపోయారు. ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని, అధిక ఫీజులు అరికట్టాలని, విద్య హక్కు చట్టం పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వెళుతున్న ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై విద్యాశాఖలు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. లేకుంటే ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో భవిష్యత్తులో ఉద్యమ కార్యచరణ చేపడతామని తెలిపారు.

కౌంటింగ్ విధులు జాగ్రత్తగా నిర్వహించాలి

అన్నమయ్య జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి రాయచోటి

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అప్పగించిన కౌంటింగ్ విధులను చిత్తశుద్ధితో బాధ్యతగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఎఆర్ఒలు, వివిధ శాఖల జిల్లా నోడల్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులతో కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా వివిధ అంశాలలో అధికారులు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలు, తీసుకోవలసిన చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు సంబంధించి కౌంటింగ్ ప్రక్రియను ఎలాంటి అంతరాయం లేకుండా సజావుగా సాఫీగా పూర్తి చేసేందుకు అధికారులందరూ చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. వివిధ అంశాలలో ప్రతి అధికారికి వారు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలపై స్పష్టంగా ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. అభ్యర్థులు, ఎలక్షన్ ఏజెంట్లు కౌంటింగ్ ఏజెంట్లు, కౌంటింగ్ సూపర్వైజర్లు అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు, వీరితో పాటు వివిధ విభాగాలలో విధులు నిర్వర్తించాల్సిన అధికారులు సిబ్బంది అందరికీ ఐడి కార్డులు జారీ చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో మీడియా ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం, పార్లమెంటు సెగ్మెంట్ నుంచి రౌండ్ వారి ఫలితాలను ఎప్పటికప్పుడు మీడియా కేంద్రానికి పంపాలని సంబంధిత ఆర్ఒలను ఆదేశించారు. ఎట్టి పరిస్థితులలో కౌంటింగ్ జరుగుతున్న హాలులోకి అనుమతించిన వారు తప్ప ఎవ్వరు మొబైల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురాకూడదని, కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రంలో ఫుడ్ అరేంజ్మెంట్స్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ పనులను పటిష్టంగా పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలలో, చుట్టుపక్కల ప్రదేశాలలో పరిశుభ్రంగా ఉండేలా శానిటేషన్ పనులను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని చెప్పారు. జూన్ 4న ఉదయం ఐదు గంటలకు కౌంటింగ్ కేంద్రంలో సిబ్బందికి మూడవ దశ రాండమైజేషన్ చేస్తారని, కావున కౌంటింగ్ సిబ్బంది అందరూ ఉదయం ఐదు గంటలకే కౌంటింగ్ కేంద్రంలో ఉండాలన్నారు. ఆరోజు ఉదయం 6 గంటలకు అబ్జర్వర్లో అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో ఇవిఎం స్ట్రాంగ్ రూములు తెరుస్తారని, 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్, 8:30 గంటలకు ఇవిఎం కౌంటింగ్ మొదలు పెడతారని పేర్కొన్నారు. సమావేశంలో డిఆర్ఒ సత్యనారాయణ, ఆర్ఒలు రంగస్వామి, హరిప్రసాద్, మోహన్ రావు, రాఘవేంద్ర, లీలారాణి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణగా వన్ స్టాప్ సెంటర్

రాయచోటి టౌన్ : మహిళలకు రక్షణగా, ఆపన్న హస్తంగా వన్ స్టాప్ సెంటర్ నిలుస్తుందని సఖీ రాష్ట్ర కార్యాలయ సిబ్బంది విజయ శ్రీ అన్నారు. గురువారం ఎస్ఎన్ కాలనీలోని వన్ స్టాప్ సెంటర్ (సఖి)ను పీడీ శశికళతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న మహిళలు, భర్త వేధింపులు, కుటుంబ కలహాలు ఉన్న మహిళలు వన్ స్టాప్ సెంటర్ ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వన్ స్టాప్ సెంటర్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. వన్ స్టాప్ సెంటర్ సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందించారు. వన్ స్టాప్ సెంటర్ నిర్వహణ రాష్ట్రంలోనే మంచిగా నిర్వహిస్తున్నందుకు సిబ్బందిని అభినందించారు.

ప్రభుత్వ వసతి గృహాల్లో

ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - కడప

ప్రభుత్వ అంధ బాలుర వసతి గృహం శంకరాపురం కడప, ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతుల బాలికల వసతిగృహం కడపలో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు, ఆపై తరగతులు చదువుతున్న 100 మంది బాలురు, 50 మంది బాలికలు వివిధ కేటగిరి(అందులు, బధిరులు, శారీరక విభిన్న ప్రతిభావంతులు) విద్యార్థులకు ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకులు ఆర్. వి. కృష్ణ కిషోర్ తెలిపారు. వసతి గృహాల్లో ప్రభుత్వ మెనూ ప్రకారం పౌష్టికాహార భోజనం, కాస్మెటిక్స్, నాలుగు జతల బట్టలు, ప్లేటు, గ్లాసు, ట్రంకు పెట్టె మొదలైనవి అన్ని ఉచితంగా ఇస్తారన్నారు. వసతి గృహాల్లో ప్రవేశం కోసం విభిన్న ప్రతిభావంత బాలురు వార్డెన్ నంబర్ 7396412434, విభిన్న ప్రతిభావంత బాలికల మాట్రన్ కం స్టాఫ్ నర్స్ నంబర్లకు 6302512485 నంబర్లకు ఫోన్ ద్వారా సంప్రదించి దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

హెలెన్ కెల్లర్స్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో.. ఒకటవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు రాయలసీమ ప్రాంతాలలోని బధిర విద్యార్థులకు ఉచిత విద్యా వసతి కల్పిస్తున్నట్లు కరస్పాండెంట్ డాక్టర్ పి. దౌలత్ ఖాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యతోపాటు స్పీచ్ తెరపి, ఆడిటరీ, కంప్యూటర్, టైలరింగ్ లో శిక్షణ ఇస్తామని తెలిపారు. తల్లిదండ్రులు విద్యార్థుల అన్ని సర్టిఫికెట్లు, పాస్పోర్ట్ సైజు ఫొటోలతో హెలెన్ కెల్లర్స్ బధిరుల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల రాజీవ్ గృహకల్ప రోడ్డు, సెంట్రల్ జైలు దగ్గర, రామాంజనేయ పురం, కడపలో సంప్రదించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9849311680, 996600675లలో సంప్రదించాలన్నారు.

'మిట్స్'లో మై భారత్ పోర్టల్‌పై శిక్షణ

మదనపల్లి: మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ (నేషనల్ సర్వీస్ స్కీమ్ యూనిట్) వారు మై భారత్ పోర్టల్, డిజిటల్ లిటరసీపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్ మాట్లాడుతూ కేంద్ర యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, క్రీడలు సహాయ సహకారాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. హాండ్స్ ఆన్ ట్రేనింగ్‌ను ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లకు రెండు రోజుల పాటు నిర్వహిస్తామని తెలిపారు. యువతకు మై భారత్ పోర్టల్‌లో ఎలా రిజిస్ట్రేషన్ చేసుకోవాలో నేర్పుతారని చెప్పారు. మేరా యువ భారత్ పోర్టల్ ఈ ఏడాది జనవరి చివరి నాటికి 1.45 కోట్లకు పైగా రిజిస్ట్రేషన్లతో చారిత్రక మైలురాయిని చేరుకుందన్నారు. యూజర్ ఫ్రెండ్లీ ఇంటర్‌ఫేస్ కారణంగా రిజిస్ట్రేషన్‌ను కొన్ని నిమిషాల్లోనే పూర్తి చేయడానికి అనుకూలంగా ఉందని పేర్కొన్నారు. నిర్మాణాత్మక, పరివర్తనాత్మక ప్రయత్నాల వైపు దేశ యువతను సమీకరించడంలో పోర్టల్ ఇప్పటికే ప్రభావం చూపుతోందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కమల్ బాషా, డాక్టర్ డి.ప్రదీప్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజేష్, రాష్ట్రంలోని వివిధ కలశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

కర్షక, కార్మికులకు అండగా

సిఐటియు నిరంతర పోరాటాలు

జెండా ఆవిష్కరణలో జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్



కడప అర్బన్ : సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

54 ఏళ్లల్లో సిఐటియు ఉద్యోగులు, కార్మికులు, కర్షకుల కోసం అనేక నిరంతర పోరాటాలు, సమ్మెలు నిర్వహించిందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పేర్కొన్నారు. సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం పాత బస్టాండ్ లోని సిఐటియు జిల్లా కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. 1970, మే 30న కలకత్తా నగరంలో సిఐటియు ఆవిర్భవించిందని పేర్కొన్నారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 23 సమ్మెలు జరిగితే అందరినీ కలుపుకొని సిఐటియు పెద్దన్న పాత్ర పోషించిందని చెప్పారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన పదేళ్ల కాలంలో కార్మికుల పైన అనేక నిర్బంధాలు విధించిందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ఏరకంగా అమ్మాలనే ఆలోచన చేస్తూ ఉందని పేర్కొన్నారు. వీటిని ఏ విధంగా కాపాడాలి, పనిచేసే కార్మికులను, వారి కుటుంబాలను ఎలా కాపాడాలి అనే నినాదంతో పోరాటం నిర్వహిస్తుందని తెలిపారు. బిఎస్ఎన్ఎల్, పోస్టల్, ఎల్ఐసి, బ్యాంకింగ్, విశాఖ ఉక్కు పరిరక్షణకు రాజీలేని పోరాటం చేస్తుందని చెప్పారు. జిల్లాలో అంగన్వాడీల పోరాటాలకు సిఐటియు అండగా నిలిచిందని పేర్కొన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణం కోసం నిర్వహించే పోరాటాల్లో సిఐటియు కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న సంఘటిత అసంఘటిత రంగం కార్మికుల కోసం నిరంతరం పోరాటాలు చేస్తూ ఉందని చెప్పారు. కార్మికుల వేతనాల పెంపు, ఇఎస్ఐ, పిఎఫ్, మహిళలకు ప్రత్యేక క్యాజువల్ లీవులు కోసం పోరాటాలు నిర్వహించి, సాధించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, పి. వెంకటసుబ్బయ్య, ఐఎంఎల్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వి. సుబ్బారెడ్డి, నాయకులు రఘురామయ్య, మున్సిపల్ యూనియన్ జిల్లా కోశాధికారి గోపి, కార్యదర్శి ఆనంద్, నగర అధ్యక్షులు సుంకర రవి, మెడికల్ రిప్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రామాంజనేయులు రెడ్డి, శంకర్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ఎమ్మార్ నాయక్, పెన్షనర్ అసోసియేషన్ నాయకులు రామకృష్ణారెడ్డి, రిమ్స్ యూనియన్ నాయకులు స్టీఫెన్, పవన్, దస్తగిరి, ఉదయ్, ఆటో యూనియన్ నాయకులు ప్రభాకర్, టీ స్టాల్ గౌస్, కార్మికులు పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** సిఐటియు ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా గురువారం స్థానిక ఆటోస్టాండ్ వద్ద జెండా ఆవిష్కరించారు. సిఐటియు పట్టణ ఉపాధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్, ఆటోస్టాండ్ యూనియన్ కార్యదర్శి నరేంద్ర, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మస్టర్ పాయింట్ వద్ద మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి శేఖర్, నాగన్న జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆదాము, దివాకర్, కమాల్ బాషా, బాలు, మున్సిపల్ కార్మికులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** సిఐటియు కార్మికుల పక్షాన రాజీలేని పోరాటాలు చేస్తోందని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం సిఐటియు కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి విజయకుమార్, అంగన్వాడీ యూనియన్ కార్యదర్శి సుబ్బలక్ష్మి, అధ్యక్షులు రాణి, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, అధ్యక్షులు చంటి, మెడికల్ రెప్స్ సంఘ రామలింగారెడ్డి, అధ్యక్షులు నరసింహారెడ్డి, ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ముంతాజ్ బేగం, పట్టణ అధ్యక్షులు సర్వేశ్వరి, బాబు, చెన్నారెడ్డి, కోశాధికారి రాఘవ, రవి, మోహన్, విశ్వనాథ్ పాల్గొన్నారు. **కమలాపురం :** స్థానిక ఆటో స్టాండ్ వద్ద సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులురెడ్డి పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో వర్గ రాజకీయ సిద్ధాంతాన్ని కాపాడటంలో ఒక చారిత్రక నేపథ్యంలో సిఐటియు ఏర్పడిందన్నారు. ఆ నాటి నుంచి వర్గ పోరాట సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లడానికి నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు ఆటో యూనియన్ కార్యదర్శి, రాజేష్ నాయకులు డానియల్, రఫీ, ప్రసాద్ రామాంజినేయులు, రేష్మ, నాగేష్, కేశవ్, షరీఫ్ పాల్గొన్నారు.



జమ్మలమడుగు రూరల్ : జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



కమలాపురం : సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు, ఆటోకార్మికులు



బహుమతి పొందిన మహిళలు

మధ్యాహ్నం భోజన నిర్వాహకులకు శిక్షణ

ప్రజాశక్తి-కలసపాడు


స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోగురువారం మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మండల విద్యాశాఖ అధికారులు ప్రేమ సాగర్ మస్తాన్ వలి, రిసోర్స్ పర్సన్స్ వెంకట రెడ్డి, శివారెడ్డి పాల్గొని పిల్లలకు పౌష్టికాహారాన్ని రుచిగా, శుభ్రంగా అందించాలని తెలియజేవారు. అనంతరం మెనూ ప్రకారం ఆహార పదార్థాలు తయారు చేసే విధానాన్ని వీడియో ద్వారా చూపించారు. వంట పరిసరాలు, పాత్రలు శుభ్రంగా ఉండేలా చూడాలని తెలిపారు. అనంతరం వంటల నిర్వహణపై పోటీలు నిర్వహించారు. పోటీలో విజేతలకు ప్రథమ బహుమతి బి. లక్ష్మీదేవి జడ్‌పిహెచ్ఎస్ బాలుర పాఠశాల, ద్వితీయ బహుమతి జడ్‌పి హెచ్ఎస్ బాలికల పాఠశాల, తృతీయ బహుమతి విజయమ్మకు అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మి, సత్తార్ బాషా, వంట ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

రేపు హనుమజ్జయంతి ఉత్సవాలు


చెన్నూరు : కడప జిల్లా మండల కేంద్రమైన చెన్నూరు బ్రాహ్మణ వీధిలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో జూన్ ఒకటో తేదీన శనివారం హనుమజ్జయంతి ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ చర్యలు చేపట్టింది. పుష్పగిరి పీఠాధిపతి అభినవ ఉద్దండ విద్య శంకర భారతి స్వామి ఆశీస్సులతో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ఉదయం ఐదు గంటలకు వేద పండితులు సుప్రభాత సేవతో పూజలు నిర్వహించనున్నారు. ఉదయం ఐదున్నర గంటలకు మూల విరాట్ విగ్రహాలకు అభిషేక అలంకరణ నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు ఆలయానికి వచ్చే భక్తులకు సర్వదర్శనం ఏర్పాట్లు చేశారు. ఉదయం 8:30 గంటలకు శ్రీ ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహానికి వేద పండితుల చేతుల మీదుగా ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహిస్తారు. భక్తులు పంచామృతాన్ని ఒక గ్లాసులో స్వయంగా తమ ఇంటి వద్దనే తయారు చేసుకొని ఆలయానికి వచ్చి ఉత్సవ విగ్రహానికి తమ స్వహస్తాలతో స్వయంగా అభిషేకం చేసుకోవచ్చని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలియజేశారు. ఈ అవకాశాన్ని భక్తులందరూ వినియోగించుకోవాలని కోరారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి చెన్నూరుకు చెందిన గలిజర్ల సాంబరాజు కుటుంబ సభ్యులు చేతుల మీదుగా అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి శ్రీ ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించనున్నారు. నెల్లూరు బృందం వారిచే కోలాటం వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ప్రజాశక్తి లింగాల విలేకరి నాగరాజు మృతి

ప్రజాశక్తి-పులివెందుల టౌన్



వైఎస్ఆర్ జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని లింగాల ప్రజాశక్తి విలేకరి నాగరాజు (45) అనారోగ్యంతో గురువారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. కొంత కాలంగా గుండెపోటు సమస్యతో ఆయన బాధపడుతూ ఉండేవాడు. ఇటీవలే ఆయన గుండెకు బైపాస్ సర్జరీ చేయించుకున్నారు. గురువారం ఉదయం ఆరోగ్య సమస్యతో అనంతపురంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. అక్కడ మళ్లీ గుండెపోటు రావడంతో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. నాగరాజుకు భార్య నాగమునెమ్మ, కూతురు, కొడుకు ఉన్నారు. కూతురుకు వివాహం చేశారు. కొడుకు వెంకటప్రసాద్ కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అప్పులు చేసి వైద్యం చేయించినా హఠాత్తుగా నాగరాజు మరణించడంతో కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. శుక్రవారం లింగాలలో నాగరాజు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నాగరాజు 15 ఏళ్ల నుంచి వివిధ పత్రికల్లో పని చేశారు. ప్రస్తుతం ఏడాదిగా ప్రజాశక్తి లింగాల విలేకరిగా పనిచేస్తున్నారు. నాగరాజు మృతికి ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్, సిజిఎం వై.అచ్యుతరావు, వైఎస్ఆర్ జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు, సిబ్బంది సంతాపం తెలిపారు. నాగరాజు కుటుంబ సభ్యులకు పలువురు ప్రముఖులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



తాగునీటి సమస్యపై ఫిర్యాదు చేస్తున్న మహిళలు


రామనపల్లి బిసి కాలనీలో తాగునీటి ఎద్దడి

చెన్నూరు : మండలంలోని రామనపల్లి బిసి కాలనీలో నాలుగు నెలలుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని గురువారం బిసి కాలనీ మహిళలు గ్రామ పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువచ్చారు. బీసీ కాలనీలో నాలుగు నెలలుగా తమకు మీరు అందడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికొచ్చేసరికి ఎక్కడో గుంతలలో నిలిచిన నీరు పట్టుకోవలసి వస్తుందని వాపోయారు. కాలనీలో నీరు రావడం లేదని గతంలో అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య తీర్చలేదని పేర్కొన్నారు. ఈ విషయంపై గురువారం గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లి కార్యదర్శి ఎదుట తమ గోడు విన్పించారు. బిసి కాలనీలో తాగునీటి సమస్య వెంటనే తీర్చాలని వారు డిమాండ్ చేశారు.

ఇష్టారాజ్యంగా ప్రయివేటు స్కూళ్ల దోపిడీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సిబిఎస్ఇ, ఐఐటి, ఒలంపియాడ్ పేరుతో ప్రయివేటు పాఠశాలలు విద్యార్థులను వంచిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు నేతి నాగేశ్వర అన్నారు. గురువారం మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘాలు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని కొన్ని ప్రయివేటు పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చుకొని పాఠ్యపుస్తకాల పేరుతో వేలకు వేలు దోచుకుని, నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతున్నాయని పేర్కొన్నారు. పట్టణంలోని శిరిడి సాయి, రెయిన్‌బో, బిఎస్‌సి ప్రైమరీ స్కూల్, కింగ్ బ్రిడ్జ్, విబి స్కూల్, ఐడిల్ స్కూల్, ఫ్యూచర్ మైండ్ పాఠశాలలు వసతి గృహాలను పాఠశాలలుగా మలచుకుని, కనీస వసతులు కల్పించకుండా సిబిఎస్ఇ, ఐఐటి, ఒలంపియాడ్ పేరుతో తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని విమర్శించారు. జీసస్ హైస్కూల్, అక్షర, నలంద, బివిఎన్ పాఠశాలలు అక్రమ అడ్మిషన్లకు పాల్పడుతూ అధిక ధరలకు విచ్చలవిడిగా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని పేర్కొన్నారు. సిబిఎస్ఇ, ఐఐటి, ఒలంపియాడ్ పేర్లతో విచ్చలవిడిగా ప్రచారాలకు పోతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, తక్షణమే విద్యాశాఖ అధికారులు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



పైడిపాలెం రిజర్వాయర్‌లో ఉన్న నీరు

పైడిపాలెం రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని పైడిపాలెం రిజర్వాయర్ నుంచి నీటిని హిమకుంట్ల కాలువకు విడుదల చేసినట్లు జికెఎల్ఐ డిఇ శ్రీనివాస్ తెలిపారు. గురువారం డ్యామ్ నుంచి నీటిని విడుదల చేశామన్నారు. అరటి, చీనీ రైతుల అవసరాల దృష్ట్యా ప్రతిరోజు 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తామన్నారు. రిజర్వాయర్ సామర్థ్యం ఆరు టీఎంసీలు కాగా, ప్రస్తుతం 3.87 టీఎంసీల నీరు ఉందన్నారు. అవసరాలను దృష్టిలో పెట్టుకుని నీటిని వినియోగిస్తున్నామన్నారు.



హోమంలో పాల్గొన్న అసిస్టెంట్ కమిషనర్ దంపతులు

గండి క్షేత్రంలో హోమాలు

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రంలో హనుమజ్జయంతి మహోత్సవాల్లో భాగంగా రెండోరోజు గురువారం వేద పారాయణం, యాగశాల ప్రవేశం, ద్వారా తోరణం, అగ్ని ప్రతిష్ఠ, హోమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాలను ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకులు రాజా స్వామి పర్యవేక్షణలో నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి దంపతులు హోమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కావలి క్రిష్ణతేజ, సభ్యుడు బిందుసాగర్, వేద పారాయణదాం రామమోహన్ శర్మ, అర్చకులు పాల్గొన్నారు.



నీతి కథలు చదువుతున్న విద్యార్థులు

వేసవి శిబిరాలు విజ్ఞానాన్ని పెంచుతాయి

ప్రజాశక్తి - చక్రాయపేట

వేసవి శిబిరాలు విద్యార్థుల్లో విజ్ఞానాన్నిపెంచుతాయని గ్రంథాలయాధికారి ఎ.రాజశేఖర్ పేర్కొన్నారు. సమ్మర్ క్యాంపులో భాగంగా గురువారం చక్రాయపేట గ్రంథాలయంలో విద్యార్థులకు నీతి కథలు చదివి వినిపించడం, వాటి అర్థం చెప్పామన్నారు. కథలతోపాటు స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాలు, ఇతర పుస్తకాలు చదివి, జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు.



యోగాపై అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి

యోగాపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - చాపాడు

స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా హాజరైన విద్యార్థులకు గ్రంథాలయ అధికారి ఆధ్వర్యంలో యోగాపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు యోగా, వ్యాయామం, ఆసనాలు వేయాలన్నారు. తద్వారా చురుకుదనంగా ఉంటారన్నారు. ఆరోగ్యంగా కూడా ఉండవచ్చని సూచించారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా అన్ని రకాల అంశాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకో వాలన్నారు.

అపురూపం అందరిలో ప్రత్యేకం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కొందరు అదృష్టమంటారు...మరికొందరు వంశపారం పర్యమంటారు. ఏది ఏమైనా ట్రిప్లెట్స్‌గా పుట్టడడం ఓ విభిన్నం.. విచిత్రం. సాధారణంగా ట్రిప్లేట్స్ ఒకరిని పోలి ఒకరుండడం ఒకెత్తయితే,ఒకేలాంటి అభిరు చులు అలవాట్లు కలిగి ఉండడం మరో విశేషం. మండలంలోని కాలువ పల్లెకు చెందిన తేజమూర్తి, చంద్రకళ దంపతులకు 2006, మే 30ను ఒకే కాన్పు రులో కార్తీక్, కుసుమాంజలి, కళ్యాణ్‌లు ముగ్గురు జన్మించారు. వీరు ముగ్గురు ఇప్పుడు స్థానిక రంగసముద్రం రోడ్డు బి.కొత్తకోట ఆదిత్య డిగ్రీ కళాశాలలో బిఎస్‌సి కంప్యూ టర్ సైన్స్ చదువుతున్నారు. గురువారం వీరి జన్మదిన వేడుకలను కళాశాలలో ఘనంగా నిర్వహించారు.ప్రిన్సిపాల్ ఎల్.ప్రసాద్, ఇన్‌ఛార్జి రాజేంద్ర, అధ్యాపకులు, తోటి విధ్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి విజయం తథ్యం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి మరోసారి విజయం సాధిస్తారని ప్రభుత్వ ఆస్పత్రి డైరెక్టర్ కంచి కల్యాణ్ కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నగర పంచాయతీ పరిధిలోని బైపాస్ రోడ్డులో గురువారం పోకనాటివీధి యువకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా అభినందనలు తెలి పారు. మరోసారి ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని మనం చూస్తామని, ఎన్‌డిఎ కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ పేరుతో వదిలిన హామీలను ప్రజలు ఎవరు నమ్మ లేదని అన్నారు. ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేసేందుకే పింఛన్ ను రూ.3,500లు ఇస్తామని చెప్పారని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి లండన్ పర్యటన ముగించుకొని వచ్చి మరల ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని ధీమా వ్యక్తంచేశారు. మహిళలు, వృద్ధులు వైసిపికి అండగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో రెండవ సచివాలయ కన్వీనర్ వరప్రసాద్, తుమ్మగింజల జనార్ధన్, కంచి శ్రీకాంత్ రెడ్డి, ముజా, బాబా, సాయి పాల్గొన్నారు.

దయనీయం.. బీడీ కార్మికుల దుస్థితి

వెయ్యి బీడీలు చుడితే రూ.250 - కార్మికులను గుర్తించి న్యాయం చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

దేశంలో తక్కువ ధరకు లభించే ధూమపానం బీడీ. దీని తయారు చేయడానికి పనిచేసే మహిళా కార్మికులు తక్కువ వేతనాలకు, ఆరోగ్య ప్రమాదాలకు, దోపిడీకి గురవుతున్నారు. బీడీ తయారీదారుల పరిస్థితులను చక్కదిద్దే నాయకులు, అధికారులు కనపడడం లేదని పలువురు పేర్కొంటున్నారు. బీడీలను (టెండు ఆకులు, చిటికెడు పొగాకుతో తయారు చేసిన చేతితో చుట్టబడిన సిగరెట్లు) సాధారణంగా మన దేశంలో 'పేదవారి పొగ' అని పిలుస్తారు. చాలా తక్కువ వేతనాలకు పేదరికం పరిస్థితుల్లో వారి స్వంత ఇళ్లలో పనిచేస్తారు. పేద మహిళల ప్రధాన జీవనాధార వృత్తి. బీడీ కర్రలు దేశంలోనే అన్ని ధూమపాన ఉత్పత్తుల్లో 85 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉన్నాయంటే ఆశ్చర్యం వేస్తుంది. భారతదేశంలోని మిలియన్ల మంది మహిళలకు అత్యంత ప్రజాదరణ పొందిన తక్కువ ధర సిగరెట్ల గృహోత్పత్తి ప్రధాన జీవనాధారం బీడీల అల్లకం. జిల్లాలో కడప పట్టణం, ప్రొద్దుటూరు, కమలా పురం, మైదుకూరు, ఖాజీపేట, ముద్దనూరు, పెదముడియం, జమ్మలమడుగులో బీడీలను తయారు చేసేవారున్నారు. జమ్మలమడుగు పట్టణంలో టెక్కాయ చేను, గడ్డవీది, బిసి కాలనీ, నాగులకట్ట, గూడుమస్థాన్ వీధి, నవాజ్ కట్ట వీధి, భాగ్యనగర్ కాలనీ వంటి వీధుల్లో చాలా మంది మహిళలు బీడీలను తయారు చేస్తున్నారు. అందులో బిసి కాలనీకి చెందిన ఉస్సేనమ్మ మేటి. ఆమె తన రోజులో 1,000 బీడీ ముక్కలను ఉత్పత్తి చేస్తే రూ.400 వస్తుందని తెలిపింది. అదీకూడా పొగాకు, ఆకులు అన్ని ఆమె తెచ్చి తయారు చేస్తే వాటిని తీసికెళ్లే యజమాని రూ.400 ఇస్తాడు. అలా కాకుండా యజమాని పొగాకు, బీడీ ఆకులు తెచ్చి ఇస్తే 1000 బీడీలను అల్లినందుకు రూ.240 నుంచి 250 ఇస్తాడని చెబుతుంది. ఉశ్సేనమ్మ 10 ఏళ్ల వయసు నుంచి బీడీ చుట్టడం ప్రారంభించింది. వివాహం తర్వాత కూడా ఇంటి వద్ద ఈ పని చేస్తున్నానని చెబుతోంది. ఇది చాలా దుర్భరమైందని, మార్పులేనిదన్నారు. ఈ పనికి చాలా శ్రద్ధ అవసరమన్నారు. ఈ పని చేయడానికి చాలా కష్టపడాలి. రోజులో కనీసం 8 నుంచి 10 గంటలు ఒకే చోట కూర్చొని పనిచేయాలి. పొగాకు ధూళి స్థిరమైన వాసనను అసహ్యించుకున్నప్పటికీ, ఆమె కుటుంబాన్ని పోషించడానికి తప్పడంలేదు. బయట తగినంత పని పొందలేకపోయినందున ఆమె ప్రమాదకరమైనా గృహ ఆధారిత పనిని సమర్థవంతంగా కొనసాగిస్తోంది. రోజంతా బీడీలు అల్లడం వల్ల ఆరోగ్యం క్షీణిస్తోందని ఆమె చెబుతోంది. అయినా జిల్లాలోని వేలాది మంది మహిళలకు ఇదే జీవనాధారం.



తయారు చేసిన బీడీ చుట్టాలు



బీడీలను తయారు చేస్తున్న ఉస్సేనమ్మ

ఆరోగ్య సమస్యలు : బీడీలు చుట్టే పని వల్ల మహిళలకు వెన్నునొప్పి, కంటి చూపు తగ్గిపోవడం, శ్వాస తీసుకోవడంలో సమస్యలు, కడుపునొప్పి వంటివి వస్తాయి. తరచూ కాళ్లు తిమ్మిర్లు, కండరాలు, నరాల నొప్పి వంటివి, భంగిమ (ఒకే వైపు కూర్చోవడం) సంబంధిత వ్యాధులకు దారితీస్తాయి. అన్నిటికంటే బీడీ తయారీ విధానం ఊపిరితిత్తుల సమస్యలతో బాధ పడాల్సి ఉంటుందని అంటున్నారు. మరికొంత మంది బీడీ కార్మికులు గొంతులో మంట, దగ్గు, ఉబ్బసం, రుతుక్రమం సమయంలో అధిక రక్తస్రావం, రక్తహీనత, శరీర నొప్పులు వస్తాయంటున్నారు. పొగాకు ధూళికి నిరంతరం గురికావడం వల్ల మైకం వంటి వాటిని అనుభవిస్తున్నట్లు చెబుతున్నారు. కాగా, సాక్షాత్తు అంతర్జాతీయ కార్మిక సంస్థ కూడా ఇదే విషయాన్ని చెబుతోంది. **తమకు న్యాయం చేయాలి :** జిల్లాలో ఎక్కువ మంది బీడీ కార్మికులు ఉన్నారని, వారికి సంబంధిత అధికారులు గుర్తింపు కార్డులు అందించాలని పలువురు కోరుతున్నారు. తగు ఆర్థికసాయంతోపాటు అనారోగ్యాలకు గురైనప్పుడు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

టీకాతో క్షయ నుంచి విముక్తి

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం : జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఖాజా మొయిద్దీన్



బిసిజి వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

బిసిజి టీకా (వ్యాక్సిన్) వేయించుకోండి.. క్షయ వ్యాధి నుంచి విముక్తి పొందండి అంటూ జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఖాజా మోయిద్దీన్ పిలుపునిచ్చారు. పట్టణంలోని నగిరిగుట్ట పట్టణ ప్రాథమిక వైద్యాశాల పరిధిలోని పెద్ద రంగాపురం సచివాలయం వాసవి కాలనీలో ఖాజా మోయిద్దీన్ ఆధ్వర్యంలో గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ, లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం, అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్‌పై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాజా మోయిద్దీన్ మాట్లాడుతూ నేటి సమాజంలో ఆడబిడ్డనే దేశ అభివృద్ధికి దోహదపడుతోందన్నారు. అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని తెలిపారు. సృష్టికి మూలం ఆడబిడ్డనే అన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, చేయించుకోవడం రెండూ నేరమన్నారు. మొదటి బిడ్డకు, రెండవ బిడ్డకు కనీసం మూడేళ్లయినా అంతరం ఉంటేనే తల్లి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అడల్ట్ బిసిజి వ్యాక్సిన్‌ను ప్రతి ఒక్కరూ వేయించుకోవాలన్నారు. రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులుగల వారు బిసిజి వాక్సిన్ తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు. తద్వారా క్షయ వ్యాధి వచ్చి, మందులు వాడిన వారికి క్షయవ్యాధి పునరావృతం కాదన్నారు. క్షయ లేని వారికి భవిష్యత్‌లో దాని బారిన పడకుండా కాపాడుకోవచ్చన్నారు. పులివెందుల డివిజన్‌లో 14 అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్స్ ఉన్నాయని, వాటిలో 4 గవర్నమెంట్ స్కానింగ్ సెంటర్లన్నారు. కలెక్టర్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి ఆదేశానుసారం ప్రతినెల ప్రయివేట్ హాస్పిటల్స్ స్కాన్ సెంటర్స్‌ను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు, సెకండ్ ట్రై మిస్టర్ అబార్షన్స్‌ను ఆడిట్ చేస్తున్నామని చెప్పారు. డెకాయ్ ఆపరేషన్ ద్వారా ప్రయివేట్ స్కాన్ సెంటర్స్‌పై నిఘా పెడుతున్నామని తెలిపారు. డిప్యూటీ డెమో రమణమ్మ మాట్లాడుతూ ఆడబిడ్డ మగ బిడ్డ పుట్టుకకు కారణం మగవారే అని తెలుసుకోవాలన్నారు. చందమామ లేని ఆకాశం ఆడబిడ్డ లేని ఇల్లు శూన్యమని తెలిపారు. కార్యక్రమంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, ఎఎన్ఎం సునీత, ప్రశాంతి, ఆశా కార్యకర్త పద్మావతి, ప్రజలు పాల్గొన్నారు.

60 ఏళ్లు పైబడినవారు టీకాలు వేయించుకోవాలి

ప్రొద్దుటూరు : 60 ఏళ్లు పైబడిన వారు బిసిజి టీకాలు వేయించుకోవాలని టిబి సూపర్‌వైజర్ బి.రాజారత్నం సూచించారు. వయోజన బిసిజి టీకా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని వైయంఆర్ కాలనీలో వయోజనులకు బిసిజి టీకా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసిజి టీకా ముఖ్యంగా 60ఏళ్లు పైబడిన వారితోపాటు సిగరెట్ తాగేవారు, షుగర్‌వ్యాధిగ్రస్తులు, పాత టిబి పేషంట్లు, వారి ఇంటి సభ్యులు టీకాలు వేయించుకోవాలన్నారు. ప్రతి గురువారం బిసిజి టీకాలు వేస్తారన్నారు. కార్యక్రమంలో హెచ్‌వి సిద్దారెడ్డి, సిఓయం వి.సుబ్బారెడ్డి, వార్డు హెల్త్ కార్యదర్శి జ్యోతి, ఆశాలు పాల్గొన్నారు.



టీకా వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ప్రశాంత వాతావరణానికి ప్రజలు సహకరించాలి



రౌడీ షీటర్లు, రాజకీయ నాయకులకు కౌన్సెలింగ్ చేస్తున్న డిఎస్పీ వినోద్‌కుమార్

ప్రజాశక్తి - వేంపల్లె

ఎన్నికల కౌటింగ్ రోజు గ్రామాల్లో ఎలాంటి ఘర్షణలు, దాడులు చేసుకోకుండా ప్రశాంత వాతావరణం ఉండేలా ప్రజలు పోలీసులకు సహకరించాలని పులివెందుల డిఎస్పీ వినోద్‌కుమార్ కోరారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో రౌడీ షీటర్లు, ఆయా క్రిమినల్ కేసుల్లో ఉన్న వారికి ఎన్నికల కౌటింగ్ రోజు అల్లర్లుకు పాల్పడకుండా ఉండాలని హెచ్చరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కౌటింగ్ రోజు గ్రామాల్లో ఎలాంటి ఘర్షణలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు ఆయా కేసుల్లో ఉన్న వారిని పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. జూన్ 3,4,5 తేదీల వరకు ఆయా రాజకీయ పార్టీల నాయకులు ర్యాలీలు, బాణసంచా కాల్చుట నిషేధమన్నారు. కౌటింగ్ జరిగే సమయంలో ఊరేగింపులు, ర్యాలీలపై నిషేదం ఉందన్నారు. ఎలాంటి కార్యక్రమాలు జరపాలన్నా పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. అనుమతి లేకుండా కార్యక్రమాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల కౌటింగ్‌కు వెళ్లే ఆయా రాజకీయ పార్టీల ఏజెంట్లు వారి పేర్లు జాబితాను శుక్రవారంలోగా పోలీసులకు అందజేయాలన్నారు. ముందుగా ఏజెంట్లుకు చెందిన జాబితాను అందజేస్తే జిల్లా అధికారులకు సమాచారం ఇస్తామన్నారు. జిల్లా కేంద్రంలో ఉండే లాడ్జిలు, ఫంక్షన్ హల్స్, అకామిడేషన్లు అన్ని పోలీసు కంట్రోల్ అధీనంలో ఉంటాయని చెప్పారు. కౌటింగ్ ప్రక్రియ నాలుగు అంచెల భద్రతా వ్యవస్థలో నడుస్తుందన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి పెద్దవారైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కౌటింగ్ ముందుగానీ, ఫలితాలు తర్వాతగానీ గొడవలు, అల్లర్లు జరగకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఎన్నికల లెక్కింపు రోజు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పోలీసు సూచనలు పాటించి ఎన్నికల లెక్కింపు పూర్తయిన తర్వాత కూడా దాడులు, ఘర్షణలు చేసుకోకుండా ప్రజలు, రాజకీయ పార్టీల నేతలు శాంతి భద్రతలను కాపాడాలని డిఎస్పీ కోరారు. బాణాసంచా అమ్మే వ్యాపారులపై కూడా ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. కార్యక్రమంలో సిఐ చాంద్ బాషా, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కౌంటింగ్ రోజు 144 సెక్షన్ : సిఐ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

జూన్ 4న సాధారణ ఎన్నికల కౌంటింగ్ నిర్వహిస్తున్న సందర్భంగా ఆరోజు వేంపల్లె పట్టణంలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని పట్టణ సీఐ శంకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో కర్ఫ్యూ వాతావరణం ఉంటుందన్నారు. హోటళ్లు, దుకాణాలు, ఇతర వాణిజ్య వ్యాపారాలు మూసేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు బయటికి రాకూడదన్నారు. వైద్య అవసరాల నిమిత్తం తప్ప పట్టణంలోకి బయట వ్యక్తులకు అనుమతి లేదన్నారు. పట్టణంలో లాడ్జిలు, ఫంక్షన్ హాల్‌ల్లో పోలీసుల అనుమతి లేకుండా ఎవరికీ గదులు కేటాయించకూడదన్నారు. పోలీస్ అనుమతి లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు, ధర్నాలు, బాణాసంచా కాల్చరాదన్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు.

సైన్స్ పాత్రపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వి.బాలబయన్న 'సమాజంలో సైన్స్ పాత్ర' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి సూత్రాలను పట్టుకొని కొంత మంది మాంత్రికులుగా, భూత వైద్యులుగా చెలామణి అవుతున్నారని, మాకు ఎన్నో మంత్రతంత్రాలు ఉన్నాయని మీ సమస్యల పరిష్కారం చేస్తామని ఏవో కొన్ని మ్యాజిక్కులు జిమ్మిక్కులు చేసి ఉన్నది లేనట్టుగా లేనిది ఉన్నట్టుగా హస్తలాఘం ప్రదర్శిస్తున్నారన్నారు. పేద ప్రజలను మూఢనమ్మకాల్లో ముంచి సొమ్ము గుంజుకుంటున్నారని అన్నారు. ప్రజలు అలాంటి వారి బారిన పడకుండా ఉండాలంటే కొన్ని మ్యాజిక్కులు కూడా తెలిసి ఉండాలని అన్నారు. అలాంటి సైన్స్ మ్యాజిక్కులు, హస్తలాఘవాన్ని పిల్లలకు నేర్పించి పిల్లల చేత చేయించారు. గ్రంథాలయాధికారి ఎన్.ఉమాదేవి మాట్లాడుతూ చదువులతోపాటు వేసవి విజ్ఞాన శిబిరం ద్వారా గ్రంథాలయంలో జరుగుతున్న చైతన్య కార్యక్రమాలు పిల్లలకి ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. కార్యక్రమంలో జెవివి నాయకులు ఎం రాంప్రసాద్‌రెడ్డి, ఎస్ ఫరూక్, ఎం చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జెవివి నాయకులు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి

పెన్షన్ నేరుగా బ్యాంకు ఖాతాలో జమ

విభిన్నప్రతిభావంతులు, 80 ఏళ్లు పైబడిన వారికి ఇంటి వద్దనే పంపిణీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

జూన్ నెలకి సంబంధించిన పెన్షన్ నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విభిన్నప్రతిభావంతులకు, 80ఏళ్లు పైబడిన వారికి ఇంటి వద్దనే పెన్షన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 7,350 మంది పెన్షన్ దారుల్లో 4,836 మంది పెన్షన్ దారులకు వారి బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. మిగిలిన 2,514 మంది పెన్షన్ దారులకు సచివాలయ సిబ్బంది జూన్ ఒకటో తేదీ నుండి 5వ తేదీలోపు వారి ఇంటి వద్దకే వచ్చి ఇస్తారన్నారు. విభిన్న ప్రతిభావంతులు, మెడికల్ పెన్షన్ దారులు, ఆధార్ కార్డు బ్యాంకు ఖాతాకు అనుసంధానం లేని వారికి, గత నెల విఫలమైన వారికి, 80ఏళ్లు వయసు పైబడిన వారికి వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా నేరుగా ఇంటి వద్దకు వచ్చి పెన్షన్ మొత్తం ఇస్తారని ఆయన వివరించారు. మిగతా పెన్షన్ దారుల ఆధార్ కార్డుకు అనుసంధానమైన మొబైల్ నెంబర్‌కు సమాచారం వస్తుందని తెలిపారు. జూన్ ఒకటో తేదీ వారి బ్యాంకు ఖాతాలో పెన్షన్ జమ చేస్తారన్నారు. పెన్షన్ దారులు ఎవరు కూడా సచివాలయం వద్దకు కానీ, ఏ ఇతర కార్యాలయం వద్దకు కానీ వెళ్లనవసరంలేదని కమిషనర్ తెలిపారు.



మాన్ అఫ్ ది మ్యాచ్ అందుకుంటున్న కరణ్

రసవత్తరంగా క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు ప్రీమియర్ లీగ్ 8వ సీజన్‌లో భాగంగా నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ అరవపల్లెలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న ఓపెన్ టు ఆల్ హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంటు రసవత్తరంగా కొనసాగుతోంది. గురువారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో గాంధీనగర్ లెవన్స్ అరవపల్లెజట్టు, వినాయక లెవెన్స్ నాగిరెడ్డిపల్లె జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన గాంధీ నగర్ జట్టు 14 ఓవర్లలో 6 వికెట్లను కోల్పోయి 171 పరుగులకు చేసింది. పాల్ రాజ్ 45, ఎమ్మెస్ మనీ 34 పరుగులు చేశారు. అనంతరం విజయం కోసం బరిలో దిగిన వినాయక జట్టు 9.4 ఓవర్లలో 72 పరుగులకు ఆల్ అవుట్ అయి పరాజయం చెందింది. గాంధీనగర్ జట్టు బౌలర్ కరణ్ 4 ఓవర్లు వేసి 17 రన్లు ఇచ్చి ఆరు వికెట్లు తీసి, విజయంలో కీలక పాత్ర పోషించి సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు రంగస్వామి చేతుల మీదుగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీని అందుకున్నారు.

రాజంపేటపై మంటపంపల్లె విజయం

మధ్యాహ్నం ముద్దు కృష్ణ లెవెన్స్ మంటపంపల్లె, రాజంపేట యాసీన్ లెవెన్స్ జట్ల మధ్య మ్యాచ్ ఆసక్తికరంగా కొనసాగింది. మొదట బ్యాటింగ్ చేసిన ముద్దు కృష్ణ జట్టు 14 ఓవర్లలో 157 పరుగులకు 6 వికెట్లను కోల్పోయింది. ప్రవీణ్ 36 బంతుల్లో 68 పరుగులు చేశాడు. అనంతరం 158 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగిన యాసిన్ జట్టు 13.1 ఓవర్లలో 77 పరు గులు చేసి అన్ని వికెట్లను కోల్పోయి పరాజయం చెందింది. రెండు ఓవర్లు వేసి 2 వికెట్లు తీయడంతోపాటు, 68 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన ప్రవీణ్ కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను అందించారు. ఈ మ్యాచ్‌కు జాతీయ వికలాంగ క్రికెట్ క్రీడాకారుడు శివకోటి, క్రికెట్ క్రీడాకారుడు చందు అంపేర్లుగా, అప్సర్, దినేష్ లు స్కోరర్ గా వ్యవహరిం చారు. కార్యక్రమంలో ఆర్గనైజర్స్ పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, ముమ్మడిశెట్టి సుధాకర్, రంజిత్ క్రీడాకారులు క్రీడాభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పారదర్శకంగా వేరుశనగ విత్తన పంపిణీ : జెడి

పెద్దమండ్యం : పారదృకంగా వేరుశనగ విత్తన కాయల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రనాయక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని వెలిగల్లు ఆర్‌బికె కేంద్రంలో వేరుశనగ విత్తనకాయల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అయన పంపిణీ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం అయన మాట్లాడు పట్టాదారు పాస్‌బుక్ కలిగిన రైతులు స్థానిక ఆర్‌బికెలో పేరు నమోదు చేసుకొని రాయితీ వేరుశెనగ విత్తన కాయలు తీసుకోవచ్చుని ఆయన తెలిపారు. విత్తన కాయలను సాగుచేసుకొని ఇక్రాప్ చేసుకోవాలని, ఇ క్రాప్ చేసుకొన్నవారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు అందుతాయని అన్నారు. ఒకవేళ వేరుశెనగ కాయలు నాణ్యాత లేకపోతే ఆర్‌బికె కేంద్రంలో వెనక్కి ఇచ్చి మరల నాణ్యమైన కాయలు పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో వాల్మీకిపురం ఎడిఎ వాణిశ్రీ, వెలిగల్లు ఆర్‌బికె అసిస్టెంట్ సుధాకర్, రైతులు పాల్గొన్నారు.